క్లుప్తంగా

పూర్వ విద్యార్థి సంఘం ఎన్నిక

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పలువురు పూర్వ విద్యార్థులు సమావేశమై కళాశాల పూర్వ విద్యార్థి సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మాధవరావు అశోక్ బాబు, ఉపాధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ పాగి బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ జమీర్, సంయుక్త కార్యదర్శిగా పోతినేని హనుమంతరావు, కోశాధికారిగా బొగ్గుల మదన్ మోహన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చావా రామచంద్రరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు, దాతలు, ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి

మధిర: వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండే పాడి పరిశ్రమ కూడా అభివృద్ధి చెందాలని చిలుకూరు గ్రామ సర్పంచ్ సంధ్యా వంశీ, పశువైద్యుడు అన్వేష్ తెలిపారు. మంగళవారం చిలుకూరు, రొంపిమళ్ల గ్రామాల్లో ఉచితంగా నిర్వహించిన పశు వైద్య శిబిరాలు ప్రారంభించారు. ఈ శిబిరాల్లో అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నులిపురుగుల వ్యాధి నివారణ మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా పద్దలకు నట్టల నివారణ మాత్రలు వేశారు.

108 వాహనాన్ని పరిశీలించిన అధికారులు

కల్లూరు: కల్లూరులోని 108 వాహనాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్ భూమా నాగేందర్, ఎఫ్‌సీ సాయికిరణ్, ఈఎంఈ ప్రణయ్‌రాయ్, ఏఎఫ్‌సీ మధు తదితరులు వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహణపై పైలట్ కె.ప్రభాకర్‌రావు, ఈఎంటీ కృష్ణయ్యకు సూచనలు చేశారు.

టైమ్ స్కేల్ మంజూరు చేయాలి

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లోని స్థితిగతులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సూపరింటెండెంట్ సరిత, సంఘం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగిరెడ్డి, బాలకృష్ణ, నాయకులు ఉన్నారు.

సిరిపురంలో గద్దర్ సంతాప సభ

వైరారూరల్: మండలంలోని కనకగిరి సిరిపురం గ్రామంలో సోమవారం రాత్రి ఐనాల కనకరత్నం అధ్యక్షతన ప్రజా గాయకుడు గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ గాలి అరుణ్‌కుమార్ మాట్లాడారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసిరెడ్డి రవి, శెట్టిపల్లి శ్రీనివాసరావు, మోరంపుడి మోహన్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, షేక్.లతీఫ్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మధిర: అనాథ మృతదేహానికి మంగళవారం ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు. తొమ్మిదినెలల క్రితం మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో అనారోగ్యంతో ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్‌జిల్లా, వత్సవాయి మండలం, కంభంపాడుకు చెందిన రెడ్డిబోయిన కృష్ణ (55) బాధపడుతూ ఉన్నాడు. దీంతో అతనిని ఆర్కే ఫౌండేషన్ వారు తీసుకెళ్లి అనాథాశ్రమంలో అతని బాగోగులు ఇప్పటి వరకు చూశారు. ఆరోగ్యం బాగోలేక సోమవారం మృతిచెందగా.. తన కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు రావడానికి నిరాకరించడంతో ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల జ్యోతి, రామకృష్ణ, సుదర్శన్, రామారావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సెకండ్ ఏఎన్‌ఎంల పోస్టుకార్డు ఉద్యమం



ఉత్తరాలు పోస్టు చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సత్తుపల్లిటౌన్: గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని గంగారం పీహెచ్‌సీ సెకండ్ ఏఎన్‌ఎంలు కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం సత్తుపల్లి పోస్టాఫీస్ వద్ద సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు సుమతి, కృష్ణవేణి, మంజుల, మరియమ్మ, లక్ష్మి, శాంతిప్రియ, సునీత, హైమావతి, రమాదేవి, రత్నకుమారి పాల్గొన్నారు.

లక్ష్యం.. 1.06 లక్షల మొక్కలు

మున్సిపాలిటీలో మొదలైన 'హరితహారం'

- ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ
- ఇప్పటికే పదివేలు నాటిన వైనం
- ఆసక్తి కనబరుస్తున్న ప్రజలు



వార్డులో మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు



పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

సత్తుపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం జోరుగా కొనసాగుతుంది. ఇటీవల కురిసిన వర్షాలతో పల్లెలు, పట్టణాల్లో మొక్కలు నాటుతున్నారు. దీంతో మహిళలు, యువత తమ ఇంటి పరిసరాల్లో పూలమొక్కలు పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం పట్టణంలో పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత ఇస్తూ.. గ్రీన్ బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో హరితహారం విజయవంతానికి చర్యలు చేపట్టారు.

1.06 లక్షల మొక్కలు సిద్ధం..

మున్సిపాలిటీ పచ్చదనంతో ఉండేందుకు పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం మైదానం, ఎన్టీఆర్‌నగర్‌లలోని నర్సరీలలో హరితహారం మొక్కలు సిద్ధం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీకి ఈ ఏడాది 1.06 లక్షల మొక్కలు హరితహారంలో నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో 54వేల మొక్కలు నివాసాలకు, 52వేల మొక్కలు వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, వేశ్యకాంతల చెరువుకట్ట, రోడ్ల వెంట, ఖాళీ స్థలాలు, మీడియం ప్లాంటేషన్లలో మొక్కలు నాటే ప్రక్రియ చేపడుతున్నారు. మొక్కల సంరక్షణకు ట్రీగార్డులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున..

పట్టణంలోని సుమారు 8వేల నివాసాలపైనే ఉన్నాయి. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు చొప్పున మొక్కలు పంపిణీ చేస్తున్నారు. పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నారు. పారిజాతం, మందార, మల్లే, నూరువరహాలు, ఆర్‌కే ఫామ్స్, నిమ్మ, నేరేడు, స్పైడర్ ప్లాంట్ మొక్కలను ఇళ్లల్లో నాటేలా ప్రోత్సహించనున్నారు. అదే విధంగా ఖాళీ స్థలాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, పార్కులు, మీడియం ప్లాంటేషన్లలో బాదం, మహాగని, సిసోడియ, రావి, స్పితోడియా, తబోబియా, పులిచర్మం మొక్కలు, బాగూనియా, సిల్వర్ ఓక అశోక్, కదంబ వంటి 15 రకాల మొక్కలను నాటనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- మొక్కలను వర్షాకాలంలో చల్లదనం ఉన్న సమయంలో ఉదయం, సాయంత్ర వేళల్లో నాటాలి.
- ఆకులు రంగుమారిన, రంధ్రాలు పడిన వాటిని ఎంపిక చేసుకోవద్దు.
- నాటిన మొక్కలను నిత్యం తగినంత సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.
- ప్రతి మొక్కకు కనీసం రెండు, మూడు కొమ్మలు ఉండటం మంచిది.
- ఇళ్లల్లో కుండీల్లో ఉన్న మట్టి మిశ్రమాన్ని ప్రతిఏటా ఆగస్టులో ఖచ్చితంగా మార్చుకోలి.
- కుండీల్లో ఉన్న మొక్కలకు నీళ్లు పోసి అనంతరం నీళ్లు బయటకు వెళ్లేందుకు అవసరమైన చోట రంధ్రాలు చేసుకోవాలి.
- మొక్కలు నాటేటప్పుడు వాటి ప్లాస్టిక్ కవర్‌ను తొలగించి దానికి ఉన్న మట్టితోనే భూమిలో నాటాలి. మొక్కలకు కింది భాగంలో బంకమట్టి కాకుండా పాడిమట్టి ఉంటే అధిక ఫలితాలు ఉంటాయి.

పచ్చదనం పెంచేలా..



సత్తుపల్లి మున్సిపాలిటీలో హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. పచ్చదనం పెంచేలా విస్తృతంగా మొక్కలు నాటుతున్నాం. హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. వార్డుల వారీగా మొక్కలను పంపిణీ చేస్తున్నాం.

– కూసంపూడి మహేష్, మున్సిపల్ చైర్మన్, సత్తుపల్లి

పదివేల మొక్కలు నాటాం..



మున్సిపాల్టీ పరిధిలోని 23 వార్డుల పరిధిలో 1.06 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటికే పదివేల మొక్కలు నాటించాం. పూలు, పండ్లు, క్రోటాన్ తదితర రకాల మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– కె.సుజాత, కమిషనర్, సత్తుపల్లి

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ఎర్రుపాలెం: శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, తదితరులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 8,16వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంగళవారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లతా జయాకర్, వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీ పరిధిలో రూ.30 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, ఏఈ నరేష్ రెడ్డి, కౌన్సిలర్లు మునుగోటి వెంకటేశ్వరరావు, వీరమాచినేని నాగ సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం, పెద్దగోపవరం, బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటాపురం గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, స్థానిక సర్పంచ్ బొగ్గుల లక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, సర్పంచ్‌లు అప్పారావు, రేణుక, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సామేలు, నాయకులు రవి, విజయ్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తు గడువు పెంచాలి



వైరా: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



బోనకల్: తహసీల్దార్ చందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

సత్తుపల్లి/వైరా/బోనకల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శివలానాయక్‌లు డిమాండ్ చేశారు. సత్తుపల్లి మండలంలోని గంగారం కాలనీలో మంగళవారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను పూర్తి చేయించారు. వైరా పట్టణ, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో.. తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో డీటీ రాము స్పందించి తహసీల్‌లో కౌంటర్లు పెంచి దరఖాస్తులను త్వరగా స్వీకరిస్తామన్నారు. అదే విధంగా బోనకల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో గడువు పెంచాలని తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బార్ షాపుల దరఖాస్తులకు 15రోజులు గడువు ఇచ్చిన ప్రభుత్వం గృహలక్ష్మికి కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం సరికాదన్నారు. దీంతో అనేక మంది దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతారని తెలిపారు. కావున దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వరకు గడువు పెంచాలని తెలిపారు. దీంతో పాటుగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మైనేని రవికుమార్, కొండలరావు, మరీదు బరకయ్య, కోటేశ్వరరావు, సీపీఎం మండల నాయకుడు బాజోజు రమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



సత్తుపల్లి: హనుమాన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కొండూరు సుధాకర్

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్ : అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. 'గడప గడపకు కాంగ్రెస్'కార్యక్రమంలో భాగంగా మంగళవారం సత్తుపల్లిలోని హనుమాన్‌నగర్‌లో, సదాశివునిపేటలో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను అందించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే.. రూ.500లకే గ్యాస్‌బండ అందిస్తామని, రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని తెలిపారు. అనంతరం హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో కొండూరు సుధాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్తుపల్లి టౌన్ సీఐ మోహన్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాలల్లో వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్ ఎస్‌కె మౌలాలీ, మల్లిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, తోట గణేష్, మొండెద్దు కృష్ణారెడ్డి, మందపాటి రవీందర్‌రెడ్డి, కొత్తూరు కోటేశ్వరరావు, ధారావత్ నాగరాజు, ఐఎన్‌టీయూసీ సెంట్రల్‌కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియాను తరిమేద్దాం..



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీ నాయక్

మధిర: ఫైలేరియా(బోధకాలు)ను తరిమేయాలని పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీ నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 10 నుంచి 12 వరకు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బోదకాలు వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పిల్లలకు, పెద్దలకు బోదవ్యాధి రాకుండా మాత్రలు మింగించాలన్నారు. వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి పట్టణంలో, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బస్తీ దవాఖాన సిబ్బంది డాక్టర్ హేమలత, ఐశ్వర్య, అఖిల, వైద్య సిబ్బంది పద్మావతి, గోవింద్, సుబ్బలక్ష్మి, లంకా కొండయ్య, కౌసల్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్యే

సత్తుపల్లి: కల్లూరు, పెనుబల్లి మండలాలకు 108 అంబులెన్స్‌లు, తల్లాడ, కల్లూరుకు రెగ్యులర్ అంబులెన్స్ మంజూరు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే, వేంసూరు మండలం బీరాపల్లి, తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ మంజూరు చేయాలని కోరారు. ఇంకా రూ.లక్ష సాయం కోసం మైనార్టీలు దరఖాస్తు చేసుకునే క్రమంలో ఆన్‌లైన్‌లో ఇబ్బందులను తొలగించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

బాధ్యతగా పాఠశాల అభివృద్ధి



కంప్యూటర్ ల్యాబ్‌లో ఎన్‌ఆర్‌ఐ సంజీవరెడ్డి, తదితరులు

వేంసూరు: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడాన్ని బాధ్యతగా భావిస్తున్నానని ఎన్‌ఆర్‌ఐ బండి సంజీవరెడ్డి తెలిపారు. మండలంలోని కందుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు రూ.3లక్షల విలువైన 12 కంప్యూటర్లను సంజీవరెడ్డి కటుంబ సభ్యులు మంగళవారం అందజేయగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంప్యూటర్ బోధనకు ఒకరిని నియమించి వేతనం కూడా ఇస్తామని తెలిపారు. సర్పంచ్ బూరుగు నాగేశ్వరరావుతో పాటు కొమరవరపు భూలక్ష్మి మందపాటి వెంకటరెడ్డి, గొర్ల ప్రభాకర్ రెడ్డి, ఇసాక్, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



రచ్చా రామకోటయ్యకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న పొంగులేటి

కొణిజర్ల: మండలంలోని బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల నాయకుడు రచ్చా రామకోటయ్య మంగళవారం తన అనుచరులతో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొంగులేటి వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, పెద్ద మునగాల సర్పంచ్ శ్రీనివాసరావు, పుల్లయ్య, కోటేశ్వరరావు, నరేంద్ర నాయుడు పాల్గొన్నారు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏన్కూరు: ఇటివల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ బాలాజీ నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పత్తిపంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నర్సింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: కొణిజర్ల, చింతకాని మండలాల పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పెద్దగోపతి ఏడీఈ బి.తిలక్ తెలిపారు. కొణిజర్ల, చింతకాని మండలాల పరిధిలో 33 కేవీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కొణిజర్ల, పెద్దగోపతి, కొదుమూరు, చింతకాని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అన్నదానం.. మహాదానం

తల్లాడ: అన్నదానం.. మహాదానమని తల్లాడ యూనియన్ బ్యాంక్ మేనేజర్ అపురూప అన్నారు. తల్లాడలో మంగళవారం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, బసవయ్య, శ్రీనివాసరావు, ప్రసాదరావు, సురేష్, దేవ, సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్సైగా తాపీ మేస్త్రి కుమారుడు

బోనకల్: మండలంలోని జానకీపురానికి చెందిన పంజి జగన్మోహన్‌రావు – లేయమ్మ దంపతుల కుమారుడు శ్యాంప్రసాద్ ఆదివారం విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఎస్సైగా ఎంపికయ్యాడు. అతని తండ్రి తాపీ మేస్త్రిగా పనిచేస్తూ.. చదివించడంతో పరీక్షల్లో 241మార్కులు సాధించి ఎస్సై పోస్టుకు ఎంపికకావడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక గ్రామ సమీపాన పెట్రోల్‌బంక్ వద్ద జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన మెకానిక్ రామిశెట్టి నాగార్జున(30) పని ముగించుకుని వైరా వైపు నుండి అన్నారుగూడెం వెళ్తున్న క్రమంలో స్టేజీ పినపాక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీట్టింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, సమాచారం అందుకున్న ఎస్సై మేడా ప్రసాద్ చేరుకుని వివరాలు ఆరా తీశారు.

దంపతులకు గాయాలు..

వైరా: వైరాలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. కొణిజర్ల మండలం అంజనాపురానికి చెందిన బెల్లంకొండ అఖిల, అప్పారావు ఎస్‌బీఐ బ్యాంకు సమీపాన ద్విచక్రవాహనంపై డివైడర్ దాటుతుండగా ఖమ్మం వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అఖిల కాలి వేళ్లు తెగిపోగా, అప్పారావుకు సైతం గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలం గెట్ల విషయమై ఘర్షణ.. కేసు నమోదు

కారేపల్లి: పొలం గెట్ల విషయంలో రెండు కుటుంబాల వారు ఘర్షన పడిన ఘటన మండల పరిధిలోని గంగారంతండా గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారంతండా గ్రామానికి చెందిన అజ్మీర వెంకటేష్, అదే గ్రామానికి చెందిన అజ్మీర కృష్ణ కుటుంబాల మధ్య గత కొంతకాలంగా పొలం గెట్ల విషయమై వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో అజ్మీర కృష్ణ కుటుంబ సభ్యులతో అజ్మీర వెంకటేష్, హీరాలాల్, సక్రు, విజయలపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో వెంకటేష్ తలకు తీవ్ర గాయమవడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా.. అజ్మీర సక్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవులపై దాడులను ఖండించండి

సత్తుపల్లిటౌన్/చింతకాని: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను ఖండించాలని ఎస్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. సత్తుపల్లిలోని సీజీఎం చర్చిలో మంగళవారం నిర్వహించిన ఎస్‌సీసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కోఆర్డినేటర్‌గా డి.వరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా చింతకానిలో చర్చీ పాస్టర్లు గ్రంథాలయం నుంచి తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమాలల్లో కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.రవికిరణ్, వి.విజయ్‌కుమార్, ప్రసాద్, రాంబాబు, ప్రభాకర్, ప్రవీణ్, యోబు, పింగళి సామేలు, శ్యామ్‌సన్, కరుణతేజ, ఏసుపాదం, రాజేష్, పాస్టర్స్ ఫెలోషిప్ మండల మాజీ అధ్యక్షుడు విజయరత్నం, అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పాల్‌రాజ్, సంయుక్త కార్యదర్శి సుధాకర్, కోశాధికారి డేవిడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

నిత్యావసరాలు పంపిణీ..

పెనుబల్లి: మండలంలోని వీయంబజార్‌కు చెందిన ఇస్తరికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఇస్తరి రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన పక్షవాతంతో బాధపడుతుండడంతో క్లబ్ ట్రెజరర్ లయన్ పొన్నగంటి వినాయక ప్రసాద్ అందించిన రూ.3 వేలు వితరణతో నిత్యావసరాలు అందించాడు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పోట్రు వెంకటేశ్వరరావు, క్లబ్ బాధ్యులు ఎస్‌కె అబ్దుల్ సలాం, సుంకర సత్యనారాయణ, జయరాం, లం మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ..

కల్లూరు రూరల్: మండలంలోని చంద్రుపట్ల కాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయిన పి.కృష్ణ కుటుంబానికి కుటుంబానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆర్థిక సాయం అందించాయి. మంగళవారం సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరావు, వల్లభనేని శ్రీను, పి.రామారావు, జక్కంపుడి కిషోర్‌లు రూ.12,000లు ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ నిత్యావసర వస్తువులు, వస్త్రాలు, వంట సామగ్రి, కొంత నగదు అందించారు. ఆయన వెంట సత్యంబాబు, నర్సింహారావు, ఉస్మాన్, అలీ, సుధాకర్, మట్టూరి జనార్దన్, లోకేష్, మోహన్‌నాయక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు..

చింతకాని: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యాభివృద్ధిని సాధించాలని వంకాయలపాటి సీతయ్య ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. మండలంలోని తిరుమలాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వంకాయలపాటి సీతయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



కొణిజర్ల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొణిజర్ల/తల్లాడ: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 12న ఉపాధ్యాయుల ప్రదర్శన ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకుడు షేక్ రంజాన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొణిజర్ల మండలంలో నిరసనకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బీఎల మండలంలో ఎఫ్‌ఎల్‌ఎస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు, పీఆర్‌సీ నివేదిక అమలు వంటి పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత ఫించన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ లాల్ సయ్యద్, టీపీటీఎఫ్ వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎఫ్ బాధ్యుడు రాధాకృష్ణ, నాగమణి, రమణ, శ్రీనివాస్, హన్మంతు, శాంతయ్య, వీరాచారి, సుధాకర్, శ్రీహరి, వెంకటేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.